ప్రజాశక్తి

గురువారం 27 జూన్ 2024

5

విజయనగరం

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో
విజయనగరం జిల్లాకు ఎనిమిదో స్థానం
మన్యం జిల్లాకు మూడోస్థానం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఇంటర్ ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 53 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలవగా, విజయనగరం జిల్లా 44 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 1,679 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 884 మంది ఉత్తీర్ణులయ్యారు. విజయనగరం జిల్లాలో 5,673 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,502 మంది ఉత్తీర్ణత సాధించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- సమిష్టిగా కార్యాచరణ రూపొందించాలి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- డివిజన్ స్థాయిలో వ్యాధుల నియంత్రణపై ఆర్‌డిఒల పర్యవేక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున సంబంధిత ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా వుంటూ తగిన కార్యాచరణ ప్రణాళిక రుపొందించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర చిన్న పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్.ఐ.వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై బుధవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో జనావాసాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూడటం, తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టడం, నీటి వనరులు క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయడం, పారిశుధ్య నిర్వహణ వంటి చర్యలపై దృష్టి సారించి శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ కేసులు పెరగకుండా దోమల నిర్మూలన చర్యలను పెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా ఈ వ్యాధుల నియంత్రణలో ప్రజలను చైతన్య పరచాలన్నారు. గత నాలుగైదు ఏళ్లలో ఈ వ్యాధులు అధికంగా ప్రబలిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మళ్లీ అటువంటి పరిస్తితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని మండలాల్లో విస్తతంగా పర్యటిస్తూ ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న వ్యాధుల నియంత్రణ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జూలై 1 నుంచి ఆగష్టు 31 వరకు జిల్లాలో డయేరియా నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నందున ప్రజల భాగస్వామ్యంతో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో దోమల నియంత్రణకు స్ప్రేయింగ్ చేయించాలని ఆదేశించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు జిల్లాలో చేపట్టిన వ్యాధుల నియంత్రణ చర్యలను వివరించారు. గత ఏడాది మొత్తంలో 444 డెంగీ కేసులు, 439 మలేరియా కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 69 డెంగీ కేసులు, 283 మలేరియా కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, డిపిఒ శ్రీధర్‌రాజా ఆయా శాఖల ద్వారా చేపట్టిన చర్యలను తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లు ఎంఎం నాయుడు, రామప్పల నాయుడు, బాలాజీ ప్రసాద్, రామలక్ష్మి, ఆర్‌డిఒలు బి.శాంతి, ఎంవి సూర్యకళ, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ మురళీకృష్ణ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

5 రోజులు క్షేత్రస్థాయి పర్యటనలు

విత్తనాల నాణ్యత, ధరల పై దృష్టి పెట్టాలి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

వ్యవసాయశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

అధికారులంతా వారంలో కనీసం 5 రోజులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, అప్పుడే వాస్తవ పరిస్థితులు తెలిసి తద్వారా సమస్యలను పరిష్కరించడం సులభమవుతుందని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు.తాను కూడా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తానని, ఉదయం పర్యటనలు చేసి, మధ్యాహ్నం సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. బుధవారం కలెక్టరేట్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వరి విత్తనాల పంపిణీ పై ఆరా తీసారు. 80 శాతం వరకు విత్తనాల పంపిణీ పూర్తయ్యిందని, మరో 5 వేల క్వింటాళ్ళ విత్తనాల అవసరం ఉందని ఇండెంట్ పెట్టినట్లు ఇంచార్జ్ వ్యవసాయ అధికారి అన్నపూర్ణ వివరించారు. జూన్ లో వర్షపాతం అధికంగా ఉన్నప్పటికీ నెల మొదట్లో వర్షపాతం లేనందున విత్తనాలను చల్లడం ఆలస్యం అయ్యిందని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ తోటపల్లి నీటిని రెండు రోజుల్లో విడుదల చేస్తామని, పరివాహక ప్రాంతాలన్నిటిలో విత్తనాలను వేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జులైలో కూడా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రత్యామ్నాయ ప్రణాళికలపై దృష్టి పెట్టాలని తెలిపారు. విత్తనాల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని,నాణ్యత, ధరల విషయంపై తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఎ.ఒలు, ఎడిలు వారానికి కనీసం రెండేసి దుకాణాలను తనిఖీ చేసి నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఎపిఎంఐపి సమీక్ష లో భాగంగా జిల్లాలో చాల తక్కువ విస్తీర్ణం ఉందని, రైతులకు అవగాహన కలిగించి ఎక్కువ విస్తీర్ణం ఎపిఎంఐపి పరిధి లోనికి తేవాలని తెలిపారు. సమావేశంలో పశు సంవర్థకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వర రావు, డిడి డాక్టర్ వై వి రమణ, మత్స్య శాఖ డిడి నిర్మల కుమారి, జిల్లా హార్టికల్చర్ అధికారి ఇంచార్జ్ శైలజ, పౌర సరఫరాల డిఎం మీనా కుమారి, మార్క్ ఫెడ్ ఎడి పద్మావతి, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

జిల్లాలో ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణుల ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిల్లో జరుగుతున్న ప్రసవాలపై ఆరా తీసారు. జిల్లాలోని పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒక్క ప్రసవం కూడా జరగలేదని డిఎంహెచ్ఒ భాస్కరరావు వివరించగా ఆయా పిహెచ్‌సిల్లో రానున్న రోజుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయిన విహెచ్‌సి భవనాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్నా వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జిల్లా కేంద్రాస్పత్రిలో సమస్యలపై కలెక్టర్ ఆరా తీసారు. ఒపి విభాగాన్ని అవసరాలకు తగ్గట్టు విస్తరించేందుకు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సూపరింటడెంట్ డా.అప్పలనాయుడుకు చెప్పారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సంఖ్య ఎందుకు తగ్గింది ?

విజయనగరం టౌన్ : జిల్లాలో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, విద్యార్థుల్లో బాలికల నిష్పత్తి ఎందుకు తగ్గుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రశ్నించారు. దీనిపై అధ్యయనం చేసి, వారంరోజుల్లో తనకు నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. విద్య అనుబంధ సంక్షేమ వసతిగృహాలపై తన చాంబర్ లో బుధవారం సమీక్షించారు. జిల్లాలో 98 శాతం ప్రవేశాలు పూర్తయ్యాయని, విద్యార్థుల్లో లక్షా, 20వేల మంది బాలురు, లక్షా, 12వేల మంది బాలికలు ఉన్నారని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఇతర జిల్లాల్లో మాత్రం విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉంది, ఇక్కడ మాత్రం తగ్గిందని అన్నారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించి, వారం రోజుల్లో తమకు నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి శతశాతం ప్రవేశాలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒల ద్వారా తనిఖీ చేయించి, వారం రోజుల్లో నివేదికను సమర్పించాలని అన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెరగాలి

ఇంటర్ విద్యపై సమీక్షిస్తూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతాశాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరంలో కనీసం 80 శాతం ఉత్తీర్ణత లేకపోతే, ప్రిన్సిపాల్స్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతీ ప్రయివేటు కళాశాలను తనిఖీ చేసి, తనకు నెలరోజుల్లో నివేదిక అందించాలని ఆర్ఐఒను ఆదేశించారు.

మోడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

అశోక్ ఎలా ఉన్నారు?

ఎమ్‌పి అప్పలనాయుడితో మోడీ కుశల ప్రశ్న

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'అప్పలనాయుడూ జీ... అశోక్ జీ ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు?' అంటూ విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు వద్ద పూసపాటి అశోక్ గజపతిరాజు కోసం దేశ ప్రధాని నరేంద్రమోడీ వాకబు చేశారు. ఎపి అభివృద్ధి, ప్రయోజనాలకు సహకరించాలని కోరుతూ టిడిపికి చెందిన ఎంపీలంతా ఢిల్లీలో బుధవారం నరేంద్రమోడీని కలిశారు. దీనికి ముందుకు ఎంపీలంతా పరిచయం చేసుకున్నారు. ఎంపి కలిశెట్టి పరిచయం చేసుకుంటుండగా మోడీ పైవిధంగా స్పందించారు. 'అశోక్ చాలా మంచివారు, హుందాగా వ్యవహరిస్తారు. ఇప్పుడు ఆయన ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? అంటూ ఆరా తీశారట. దీనికి కలిశెట్టి బదులిస్తూ.... 'అశోక్ క్షేమంగా ఉన్నారు. మీరు చెప్తున్నట్టుగా ఆయనకు పదవీ యావలు లేవు. బిసి సామాజిక వర్గానికి చెందిన తనకు ఎంపీ పదవి కట్టబెట్టేందుకు వెనక్కి తగ్గారు. నా గెలుపునకు కూడా ఆయన కృషిచేశారు'. అంటూ మోడీకి కలిశెట్టి బదులిచ్చారట. దీనికి ప్రతిస్పందించిన మోడీ 'అశోక్ పేరును నిలబెట్టాల్సిన బాధ్యత నీదే' అంటూ మాట్లాడారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలంటూ అప్పలనాయుడు మోడీని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయగనరం కోట

ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగానికి, రవాణాకు దూరంగా ఉండాలని ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. మత్తు పదార్ధాల విక్రయం, రవాణ, వినియోగించే వారి సమాచారాన్ని డయల్ 100 లేదా టాస్క్ ఫోర్స్ సిఐ 9121109418 కు అందించాలని కోరారు. అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వి నియోగం, రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులతో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి సిఎంఆర్. జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎఎస్‌పి అస్మాఫర్హీన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్‌పి పిలుపునిచ్చారు. గంజాయి అక్రమ రవాణ కేసుల్లో ఎవరైనా యువత ఒకసారి చిక్కుకొని, అరెస్టు అయితే వారి భవిష్యత్తు నాశనమైనట్లేనన్నారు. నిందితులపై నేరం రుజువు అయితే 10ఏళ్లకు పైబడి జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడే యువత శారీరక రుగ్మతలకులోనై, జ్ఞాపకశక్తి కోల్పోయి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి, నేరాలకు పాల్పడుతూ, దురదృష్టవసాత్తు కేసుల్లో నిందితులుగా మారుతూ, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని వివరించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి, మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ఎస్‌పి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, సైకాలజిస్టు హిమబిందు, డిఎస్‌పిలు గోవిందరావు, యూనివర్స్, 1వ, 2వ పట్టణ, రూరల్, ఆర్మ్ డ్ రిజర్వు సిఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

పిల్లలకు ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?

- భవన నిర్మాణం పూర్తి కాకుండానే స్కూల్ ప్రారంభించిన నారాయణ యాజమాన్యం
- చర్యలకు పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

నారాయణ స్కూలు వద్ద నిరసన తెలుపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు, చిన్నారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవనాలు నిర్మాణాలు జరుగుతుండగా తరగతులు నిర్వహిస్తే.. జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యాలని, భవనాలు పూర్తి కాకుండా తరగతులు నిర్వహణకు విద్యా శాఖ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారంటూ నారాయణ సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థుల తల్లి తండ్రులు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ప్రశ్నించారు. నిర్మాణం జరుగుతున్న భవనం వద్ద పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సిబిఎస్ఇ సిలబస్‌తో నూతన స్కూల్ ను నారాయణ యాజమాన్యం ప్రారంభించిందన్నారు. భవన నిర్మాణం పూర్తి కాకుండా నే అడ్మిషన్లు పూర్తి చేశారని, తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేశారని అన్నారు. భవన నిర్మాణం అసంపూర్తి గా ఉండగానే కరెంట్, నీరు లేకుండానే స్కూలును ప్రారంభించడం మంచిది కాదని అన్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాల తరగతులు నిర్వహించడమంటే పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని అన్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకున్న పిల్లలు లిఫ్ట్ గొయ్యిలో పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నారాయణ యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండు చేశారు, స్కూల్ ప్రారంభానికి అనుమతి ఇచ్చిన జిల్లా విద్యా శాఖా అధికారులిపైన , నారాయణ యాజమాన్యం పైన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థిని తండ్రి యుఎస్ రవి కుమార్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న భవనం కూలిపోతే పిల్లల ప్రాణాలకు రక్షణ ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే వేరేచోట క్లాసులు ప్రారంభించి స్కూల్ నడపాలని కోరారు.ధ ర్నాలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి .రామ చంద్రరావు, మురళీ, కె.సురేష్, జగన్మోహన్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి నూతన బస్సులు ప్రారంభం

నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సులో నూతన బస్సులను స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్‌టిసిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్‌టిసి అవుగ్‌గేట్ మూసివేతను ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి రవి, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, జోన్ 1 డిప్యూటీ సిఎం కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సిఐ ఆదినారాయణ, టిడిపి నాయకులు లక్ష్మీ వరప్రసాద్ , గంటా పోలినాయుడు, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్రచికిత్సలు

విజయనగరం టౌన్ : వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహించామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. బుధవారం కొత్తపేటలో ఉన్న స్టెరిలైజేషన్ సెంటర్ కు చేరుకుని కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సలు, యాంటీ రాబిస్ టీకాలు చేపట్టే విధానాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఒ మాట్లాడుతూ ఏప్రిల్ 19 నుండి నేటి వరకు 1,395 కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలను, సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలను నిర్వహించామన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ టి.మోహన్, జంతు సంక్షేమ సంఘం అధ్యక్షులు లోగిస రామకృష్ణ, బ్లూ క్రాస్ ప్రతినిధి మద్దిల సోంబాబు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారుల ఉదాసీనత

రెండేళ్లపాటు ఏం చేశారంటున్న ప్రజలు ● కోర్టును ఆశ్రయించనున్న వైసిపి నాయకులు

నోటీసు అంటిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి.-విజయనగరం టౌన్

పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే ఏ చిన్న పొరపాట్లు ఉన్నా అనుమతులు ఇవ్వరు... ఇచ్చినా నిబంధనలు ప్రకారం లేకపోతే నిర్మాణాలను కూల్చేస్తారు. అటువంటిది ఏకంగా రెండేళ్ళుగా ఎకరా స్థలంలో నిర్మితమవుతున్న వైసిపి కార్యాలయం పట్ల కార్పొరేషన్ అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించారని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు. కెఎల్ పురంలో టిడిపి నాయకుడుగా ఉన్న వ్యక్తి ఇంటి నిర్మాణంలో కొంచెం అడుగు ముందుకొచ్చి నిర్మాణం చేశాడని ఏడాది పాటు ఇళ్లు కట్టుకోనీయకుండా అధికారులు నిలిపివేశారు. చివరకు వైసిపిలో చేరిన తర్వాత ఎటువంటి ఆటంకం లేకుండా ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. కంటోన్మెంట్‌లోని ప్రభుత్వ స్థలాల్లో రేకులు షెడ్ లు వేసుకొని 30 ఏళ్ల నుంచి నివాసమున్న ఇళ్లను నిర్ధాక్షణ్యంగా బుల్డోజర్ లతో తొలగించిన అధికారులకు అనుమతులు లేకుండా రెండేళ్ళుగా కడుతున్న నిర్మాణం పనులు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు అంటున్నారు. ప్రతి వార్డుల్లో సచివాలయాలు ఉన్నాయి, సచివాలయం పరిధిలో టౌన్ ప్లానింగ్ కార్యదర్శి అంటారు, టౌన్ ప్లానింగ్ విభాగంలో టిపిఒ, ఎసిపి వంటి అధికారులు ఉన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన అధికారి కమిషనర్ ఉంటారు. గజం భూమిలో అక్రమ నిర్మాణం జరిగితే ఊరుకోని అధికారులుఎకరా భూమిలో అనుమతులు లేకుండా భవనం కడితే ఎలా ఊరుకున్నారని టిడిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. వైసిపి కార్యాలయానికి విఎంఆర్‌డిఎ అనుమతులు గాని, అగ్ని మాపక శాఖ అనుమతులు గాని లేవు. అయినా రెండేళ్లపాటు ఏమీ అనకుండా ఇప్పుడు అక్రమ నిర్మాణమంటూ నోటీసు ఇవ్వడంపై చర్చ జరుగుతోంది.

కోర్టే దిక్కు...

వైసిపి కార్యాలయాన్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, అనేక అభ్యంతరాలు ఉన్నాయని కార్పొరేషన్ సిబ్బంది సోమవారం నోటీసులు ఇచ్చారు. దీనికి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. దీంతో వైసిపి నాయకులు భవన నిర్మాణ విషయంలో అనుమతులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కోర్టుకు వెళ్లే ఆలోచనలో వైసిపి పెద్దలు ఉన్నట్లు సమాచారం.

విసి అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ యునివర్సిటీలో వైస్ ఛాన్సలర్ అక్రమాలపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి డిమాండ్ చేశారు.బుధవారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురజాడ యూనివర్శిటీలో విద్యా ప్రమాణాలు లేని ఆచార్యుడిని విసిగా నియమించడం విచారకరమని అన్నారు. వైసిపి వీరాభిమాన అయిన వెంకట సుబ్బయ్య ను వైస్ ఛాన్సెలర్‌గా 2023లో ప్రభుత్వం నియమించిందన్నారు. భవనాలు నిర్మాణంలోనూ, డబ్బులు ఇవ్వలేదని సెక్యూర్టీ గార్డులు తొలగింపు, అక్రమాలకు అండగా నిలిచే వ్యక్తిని రిజిస్టార్ గా నియించుకోవడం వంటి అనేక అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. విద్యార్థులు సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కితే స్పందించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రూ.20 కోట్లతో నిర్మాణం జరుగుతున్న పరిపాలన భవనం నిర్మాణ పనుల్లో అవినీతికి పాల్పడుతూ నాణ్యత లేకుండా పనులు చేయిస్తున్నారన్నారు. తక్షణమే విచారణ జరిపి వైస్ ఛాన్సలర్ ను సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కె.సూర్యనారాయణ, వి.నాగరాజు, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున ప్రజారోగ్య విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను, సిబ్బందికి నగర పాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. వ్యాధుల నియంత్రణపై బుధవారం కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో జనావాసాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూడటం, తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టడం, నీటి వనరులు క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయడం, పారిశుధ్య నిర్వహణ వంటి చర్యలపై దృష్టి సారించాలని తెలిపారు. మలేరియా, డెంగీ కేసులు పెరగకుండా దోమల నిర్మూలన చర్యలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

పూడిక తీత పనులు పరిశీలన

నగరంలోని ప్రధాన కాలువలతో పాటు, చిన్న చిన్న కాలువలలో కూడా పూడికలు ఉండరాదని పారిశుధ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. కంటోన్మెంట్, కెఎల్ పురం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కంటోన్మెంట్ గణేష్ కోవెల సమీపంలో చాలా కాలంగా పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు రహదారులపై ప్రవహిస్తుందని గమనించిన ఆయన పూడికలు తీయించే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు . అనంతరం ప్రజారోగ్య విభాగం వ్యర్థపదార్థాలతో తయారు చేసిన ఆకర్షణీయ పూల కుండీలను పరిశీలించి సిబ్బందిని అభినందించారు.

కొప్పెర్ల గురుకులంలో ప్రవేశాలకు నేడు పరీక్ష

విజయనగరం టౌన్: కొప్పెర్ల గురుకుల పాఠశాలలో 6,7,8,9 వ తరగతులలో మిగిలిన ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 27న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ పివి పూర్ణచంద్రరావు తెలిపారు. పరీక్షకు వచ్చే విదార్థులు ఆధార్, కుల ధవీకరణ పత్రాల జిరాక్స్, పరీక్ష పాడ్, బాల్ పాయింట్ పెన్నుతో గురువారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం కోట : ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి వినతినిచ్చారు. ఈ సందర్భంగా ఎపియస్ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ సెక్రెటరీ ఎ.అశోక్ మాట్లాడుతూ ఆర్టీసీలో కాంట్రాక్టు కార్మికులు 7300 మంది థర్డ్ పార్టీ విధానంలో పని చేస్తున్నారని, దీనివల్ల చాలా వరకు నష్టపోతున్నారని తెలిపారు.. ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అప్కాస్‌లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

చెవిటి,మూగ విద్యార్థుల పాఠశాల దత్తతకు విరాళం అందజేస్తున్న అశోక్‌గజపతిరాజు

ఘనంగా అశోక్ జన్మదిన వేడుకలు

- పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదానాలు
- చెవిటి, మూగ విద్యార్థుల పాఠశాలకు విరాళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎప్పటిలానే చెవిటి, మూగ విద్యార్థుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. జిల్లాకు చెందిన చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, బొబ్బిలి చిరంజీవులు, పతివాడ నారాయణస్వామినాయుడు, ఆర్‌పి భంజ్‌దేవ్, నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, మక్కువ శ్రీధర్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు పేర్ల వారి వీధిలో గల చెవిటి మూగ పాఠశాల విద్యార్థులను ఏడాదిపాటు దత్తత తీసుకునేందుకు కుటుంబ సభ్యులు , పార్టీ నాయకులు అందించిన 1,17,000 విరాళాన్ని పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. మద్దాల ముత్యాలరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ప్రభుత్వ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు భోజనప్లేట్లు, గ్యాసులు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి చేతుల మీదుగాపంపిణీ చేశారు. అవనాపు విజయ్ ఆధ్వర్యాన పూల్ బాగ్ కోలనీలో గల ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాలకు వాషింగ్ మిషన్‌ను అశోక్‌గజపతి చేతులమీదుగా అందజేశారు. విటి అగ్రహారంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్, కరస్పాడెంట్, ప్రిన్సిపాల్ , అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. కార్యక్రమాల్లో నాయకులు ఐవిపి రాజు, రాజేష్‌బాబు, లక్ష్మీవరప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటాపోలినాయుడు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమవుతాయని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ బి. వెంకట్రావు అన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పోలీసులు, ఎస్ఇబి, సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మిమ్స్ ఆసుపత్రి వద్ద ర్యాలీనుద్దేశించి సిఐ వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ డి.రామ గణేష్, ఎస్ఇబి అధికార్లు, సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సత్య నారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ లెంక సంధ్య, పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాలు వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టాలి

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం జీవితాలను చిత్తు చేసి నాశనం చేస్తాయని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాయుడువలసలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, యువతచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, రాజ శేఖర్, కృష్ణంనాయుడు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్ల: ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, గుర్ల పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి గుర్ల కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్.ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్‌పిఒటి ప్రసాద్, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న పోలీసులు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

బాడంగి: యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు బానిసలై విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఎస్ఐ జయంతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు, మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ పిఒ సూర్యనారాయణ, విద్యార్థులు, పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక పశు వైద్య కళాశాల అవరణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై బుధవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన ఎస్ఐ యల్. దామోదర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, వ్యాస రచన పోటీలను నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. యన్ ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ కుమార్, డాక్టర్ వై.ఆర్.అంబేద్కర్, డాక్టర్ ఇక్బాల్ హైదర్, డాక్టర్ షేక్ మస్తాన్ బి, ఒఎస్ఎ డాక్టర్ సుధారాణి, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఎక్సైజ్ పోలీసుల సహకారంతో రాజాం కోర్ట్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అధ్యక్షతన ర్యాలీని నిర్వహించారు. అంటేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా ఎక్కువైందని అనేకమంది బానిసలవుతున్నారని అన్నారు. ఈ ర్యాలీలో రాజాం జూనియర్ సివిల్ జడ్జ్ పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ, రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాసరావు, రాజాం టౌన్ ఎస్‌క్ష్మి వై.రవికిరణ్, రాజాం ఎక్సైజ్ ఎస్ఐ ఎస్.చంద్రశేఖర్ రావు, ప్రభుత్వ న్యాయవాది ఎస్. పోలా రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక వేంకటేశ్వర జూనియర్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల పట్ల ఆకర్శితులు కాకుండా ఆరోగ్యవంతమైన జీవితంపై ఆశలు పెంచుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తామని, వీటి అక్రమ రవాణాకు సహకరించమని నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు.

రేగిడి : డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పి, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ ఈ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం సంకిలి గ్రామంలో యాంటీ డ్రగ్స్ పై ప్రజలకు విద్యార్థులకు యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో రైతులకు సరిపడా విత్తనాలు

భోగాపురం: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. భోగాపురంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1700 ఎకరాల్లో వరి సాగుకు అనుకూలంగా ఉందన్నారు. అందుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. రాయితీతో అందిస్తున్న ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జి. సురేష్, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పరువుల సుధాకర్, బాలిపల్లి సత్తిబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్, జక్కపు రవి, తెదేపా నాయకులు సంగం అప్పలసూరి, బొడ్డ హరిబాబు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాం ఆర్‌బికె వద్ద సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్లా లక్ష్మీ చేతుల మీదుగా రైతులకు అవసరమైన ఖరీఫ్ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఎర్ర సన్యాసిరావు, అగ్రికల్చర్ సహాయకుడు, రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన జెడ్‌పిటిసి

చీపురుపల్లి: చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం వెనుక ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని స్థానిక జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష బుధవారం సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో సమస్యలుంటే తెలపాలని వాటిని జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తీసుకు వెలతామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారు 60 మంది వరకు విద్యార్థులు కొత్తగా చేరారని వార్డెన్ తెలియజేశారు. ఆమె వెంట వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జి.వి.రమేష్, వార్డెన్ సత్యనారాయణ, స్కూల్ ఉపాధ్యాయులు కందిగోపి, పి తిరుపతిరాజు, ప్రభాత్, మురళి, నాగచైతన్య ఆనంద్, వెంకటేష్, వినోద్ తదితరులు ఉన్నారు

గురుస్వామి కుటుంబానికి జెడ్‌పి చైర్మన్ పరామర్శ

మెరక ముడిదాం : మండలంలోని బైరిపురం గ్రామానికి చెందిన అయ్యప్ప గురుస్వామి బోర అప్పలనాయుడు కుటుంబాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. బోర అప్పలనాయుడు గత మంగళవారం రాత్రి ఆకస్మికంగా మరణించారు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, కూతురు జ్యోతి, అల్లుడు లక్ష్మణ, కొడుకు వెంకటేష్ ఉన్నారు. ఆయన మండలంలోని పలువురు అయ్యప్ప భక్తులకు మాలలు వేస్తూ, ఒక క్రమశిక్షణ కలిగిన గురువుగా పేరొందారు. విషయాన్ని తెలుసుకున్న జెడ్‌పి చైర్మన్ బైరిపురం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్ వి రమణరాజు, కోట్ల వెంకటరావు, పప్పల క్రిష్ణ మూర్తి, బూర్లె నరేష్, కర్రోతు నాగేశ్వరరావు, కె. మల్లికార్జునరావు, ఎస్. రామకృష్ణ, ఎస్. చిన బాబు ఉన్నారు.

నీటి నిల్వల వల్ల దోమలు ఉత్పత్తి

శృంగవరపుకోట: పరిసరాలలో నీటి నిల్వలు వల్ల దోమలు అధికంగా ఉత్పత్తి చెందుతాయని వైద్యాధికారులు డాక్టర్ బి శిరీష, డాక్టర్ ఎన్ మానస అన్నారు. ఎస్ కోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బొడ్డవరలో మలేరియా మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డవర నుంచి గడిబోవ వరకు ఈ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు అభివృద్ధి చెందుతాయని వాటి వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ ర్యాలీలో బొడ్డవర సర్పంచ్ మీనా, ఉప సర్పంచ్ శ్రీరాములు, మురళి రాజు, దార పర్తి సర్పంచ్ సన్యాసిరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గంట్యాడ: రానున్న వర్షాకాలంలో రోగాలు సంభవించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈగలు, దోమలు నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను [illegible] చేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు గ్రామ సచివాలయం ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని డయేరియా వ్యాధులు సంభవించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ భవాని, ఇఓపిఆర్‌డి ఉమా భారతి, ఆరోగ్యమిత్ర సంతోష్, గంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఒబలయ్య పాలెం, వేపాడ గ్రామాలలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒలు జి. జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు స్మార్ట్ టీవీలలో విద్యార్థులకు ప్రార్థన గీతాలను ఆలపించి లయబద్ధంగా పాడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంపై దృష్టి పెట్టి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. స్కూల్ టైం టేబుల్, లెసన్ టైం టేబుల్, లెసన్ ప్లాన్ డైరీలు టిఎల్ఎం గోడ చార్టులు పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల పరిశీలన, భోజన నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

సిబిఎం పాఠశాలను తరలిస్తే సహించం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో ఉన్న సిబిఎం బాలికొన్నత పాఠశాలను తరలిస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మణికుమార్, సిబిసిఎన్‌సి అధ్యక్షులు అదృష్టకుమార్, సిబిఎం చర్చి అధ్యక్షులు జి.వేణు అన్నారు. స్థానిక సిబిఎం పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.రత్నకుమార్ విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పాఠశాలను కోమటిపల్లి తరలిస్తారని ఆరోపణలు రావడంతో సమావేశానికి వెళ్లి కరస్పాండెంట్ రత్నకుమార్‌ను నిలదీశారు. పాఠశాలను తరలిస్తే పోరాటం చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. పాఠశాలను తరలించే హక్కు మీకు ఎవరు ఇచ్చారని నిలదీయడంతో కరస్పాండెంట్ రత్నకుమార్ మాట మార్చారు. పాఠశాలను తరలించే ప్రసక్తే లేదని, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో చర్చించి మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు విద్యను అందిస్తామన్నారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు శాంతించి పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. పాఠశాల గుర్తింపును రెన్యూవల్ చేసేందుకు, సిబిఎం ఆస్తులను కాపాడేందుకు, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పనకు తీర్మానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సిబిఎం చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నిలదీసిన ప్రజాసంఘాలు

కరస్పాండెంట్‌ను నిలదీస్తున్న సిఐటియు నాయకులు

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 16 రోజులు సమ్మె సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు సంక్రాంతికి వెయ్యి రూపాయలు బోనస్, రెండు నెలలు మెడికల్ అలవెన్స్, యూనిఫారాలు, చెప్పులు, సబ్బులు, చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈలోగా ఎన్నికలు రావడంతో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కార్మికులను ఓడించారని, ఈ ప్రభుత్వమైనా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని, 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం 96 జీవో ఇచ్చే డి.ఎ ప్లస్ వేతనం కలిపి రూ.25వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఆ హామీని ఇప్పుడున్న టిడిపి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి. గౌరేష్, కార్యదర్శి జె. రామారావు బి. వెంకటి కార్మికులు పాల్గొన్నారు.

'సహారా'కు బిజెపి అండ

ప్రజాశక్తి-బొబ్బిలి

సహారా ఇండియా యాజమాన్యానికి బిజెపి కొమ్ము కాయడం వల్లనే డిపాజిట్ దారులకు అన్యాయం జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. పట్టణంలోని మహారాణిపేటలో బుధవారం సహారా ఇండియా ఏజెంట్లు, ఖాతాదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సహారా యాజమాన్యం అధిక వడ్డీలను ఆశ చూపి కోట్లాది మంది ప్రజలు నుంచి రూ.3లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సహారా యాజమాన్యానికి బిజెపి అండగా ఉండటం వల్లే ఖాతాదారులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కుమారుడు సహారా గ్రూపులో చేరి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఖాతాదారులకు రూ.25వేల కోట్లు చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సహారా డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరుతూ జూలై 5న గంటి ప్రసాదం భవనంలో జరగనున్న సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బిఎల్ దాసు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- గజపతినగరం

స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో గల బాలికల వసతి గృహాన్ని తమ పాఠశాలలో చదువుతున్న హాస్టల్ విద్యార్థుల కోసం కేటాయించాలని ప్రధానోపాధ్యాయులు సిహెచ్. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది మంత్రి కొండపల్లి శ్రీనివాసున్ కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి తమ వినతిని అందజేశారు. తమ పాఠశాల విద్యార్థుల కోసం నిర్మించిన వసతి గృహాన్ని అప్పటిలో కాలేజీ విద్యార్థుల కోసం తాత్కాలికంగా కేటాయించారని, తమ విద్యార్థుల సౌకర్యార్థం తిరిగి తమకు అప్పగించాలని కోరారు. దీనివల్ల పాఠశాలలో చేరికలు శాతం పెరగడంతో పాటు, విద్యార్థులకు రాకపోకల ఇబ్బందులు తలెత్త వన్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాసును సత్కరించి పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ మార్పునకు చర్యలు

పురిటిపెంట మామిడి బంద కాలనీ శివారులో గల డంపింగ్ యార్డ్ మార్పునకు తక్షణమే చర్యలు చేపట్టాలని, ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన మామిడి బంధ కాలనీలో గల ప్రాంతాన్ని స్థానికుల విజ్ఞప్తి మేరకు సందర్శించారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తమ సమస్యను మంత్రి కొండపల్లికి వివరించారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారుల తో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ యాడ్‌ని మార్చడానికి అవసరమైన స్థలాన్ని గుర్తించాలని, తహశీల్దార్ సిహెచ్ రమేష్‌కు ఆదేశించారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - జామి

జిఒ నెంబరు 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అల్లు వీధి పాఠశాలలో యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ జీవో 117ను రద్దు చెయ్యాలని, పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మీడియం లు నిర్వహించాలని, హైస్కూల్ ప్లస్ ప్రారంభం అయిన జామి ఉన్నత పాఠశాలకు అర్హత కలిగిన లెక్చరర్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం ప్రభుత్వ బడులను రక్షించుకుందాం అనే పేరు మీద యుటిఎఫ్ ప్రచురించిన కరపత్రాన్ని మండల శాఖ ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి, రాజారావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, ఎమ్ తాతంనాయుడు, మండల కార్యదర్శులు జనార్దన్ రావు, ఎస్ ముత్యాలు, పి అప్పలరాజు, పి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రస్ట్‌కు ఆర్థిక సాయం

కొత్తవలస: మండల కేంద్రంలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్‌లో ఉంటున్న 42 మంది ఒంటరి వృద్ధులకు దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.12వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సేవ దృక్పథంతో ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో ఈ సాయం అందించామన్నారు. వృద్ధులకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో పిల్లల ప్రతి ఇంటికి వెళ్లి వస్త్రాలు, కొంత డబ్బులు సేకరించి, ఉపాధ్యాయుల సహాయంతో ఈ సాయం అందించారన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి వృద్ధులకు పేదవాళ్లకు సహాయం చేయాలని పీడీ కృష్ణరాజు అన్నారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.కమలావాని, జి. ఎస్. ఎస్.ఎస్ శర్మ, పి.ఎస్.ఎన్ మూర్తి, టీ.వీ కామేశ్వరి, పి.చిన్నంనాయుడు, జి.శ్రీనివాసరావు, కే. శ్రీనివాసరావు, నక్షత్రరావు, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, రమణమూర్తి, ఎంవిఎస్ నాయుడు, ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, మెంబర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు జిందాల్ కార్మికుల దీక్షలు

కొత్తవలస: జిందాల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఆరవ రోజుకి చేరాయి. జిందాల్ యాజమాన్యం లే ఆఫ్ పేరుతో కార్మికులను బయటికి నెట్టి నేటికి 41 రోజులు గడుస్తుంది. జిందాల్ యాజమాన్యం కనీసం స్పందించుకోవడంపై కార్మికులు, కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల పట్ల కనికరం చూపి, కంపెనీ తెరవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 40 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా లే ఆఫ్ పేరుతో కంపెనీ బయట ఉంచడం విచారకరమని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిందాల్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పనిని కల్పించాలని కోరారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. బుధవారం జరిగిన సమ్మెలో జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బట్టి కాలువపై ఇరిగేషన్ అధికారుల దృష్టి

భోగాపురం: భోగాపురం గ్రామంలోని మేజర్ సమస్య అయిన బట్టి కాలువపై జల వనరుల శాఖ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు ఆ శాఖ జెఇ కనకమహలక్ష్మి బుధవారం స్థానిక నాయకులతో కలిసి బట్టికాలవను పరిశీలించారు. అంబేద్కర్ జంక్షన్‌తో పాటు దేవుళ్ళు కిరణా షాప్ సమీపంలో ఉన్న కల్వర్టుల ఎత్తును పెంచాలని నాయకులు సూచించారు. ఈ మేరకు ఆమె కొలతలు వేసి పరిశీలించారు. గతంలో ఎంతవరకు పని జరిగిందో అక్కడి నుంచి మళ్లీ నిధులు తెప్పించి కాలువ నీరు నిల్ల ఉండకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం అంచనాలను ఇరిగేషన్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పరువుల సుధాకర్, బాలిపల్లి సత్తిబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్, జక్కపు రవి, సంగం అప్పలసూరి, బొడ్డ హరిబాబు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయిలో పేరుకుపోయిన చెత్త, మురుగను బుధవారం సిబ్బంది తొలగించారు. అధ్వాన్న పారిశుధ్యంపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు ఆధ్వర్యంలో గ్రామానికి ఆనుకొని వంతెన వద్ద పేరుకుపోయిన చెత్తను, తొలగించారు. ఎస్‌సి కాలనీలో పూడికను తీసేందుకు జెసిబి అవసరం ఉన్నందున ప్రస్తుతం జెసిబి అందుబాటులో లేకపోవడంతో రెండు మూడు రోజుల్లో పంట పొలాలకు వెళ్లే కాలువలో పూడికను తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - రామభద్రపురం

జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపాన పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనంపై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ప్రమాద వివరాలు పరిశీలించారు. స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా ఏదో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్లు గమనించారు. అదే సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో జనసంచారం లేకపోవడంతో వాహనాన్ని ఎవరూ గుర్తుపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. మృతుని వివరాలు అందుబాటులో లేకపోవడంతో హిట్ అండ్ రన్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపైనుంచి పడి పెయింటర్ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని గజరాయనివలస గ్రామంలో పెయింటింగ్ వేస్తుండగా సహాయంగా ఉన్న తాడు తెగి కింద పడిపోవడంతో పెయింటర్ రాగోలు మహేష్ (38) మృతి చెందాడు. మెరకముడిదాం మండలం చిన్నమరిపేట గ్రామానికి చెందిన మహేష్ గజరాయనివలసలో నల్ల శ్రీరామ్ నూతన గృహానికి రంగులు వేసేందుకు బుధవారం మేడపైకి వెళ్లి రోప్ సహాయంతో పెయింటింగ్ వేస్తున్నాడు. ఒక్కసారిగా రోపు తెగిపోవడంతో రెండో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ క్రమంలో కింద ఉన్న ఇనుప గేటు కడుపులో గుచ్చుకోవడంతో అక్కడికక్కడ చనిపోయాడు. మృతునికి పెళ్లి అయ్యి విడాకులు అయ్యాయి. పిల్లలు లేరు. తండ్రి కూడా ఇటీవల పడిపోవడంతో వైద్యం చేసికోవడానికి తాడేపల్లిగూడెంలో ఉన్నాడు. మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయంతి తెలిపారు.

ప్రయివేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అధిక ఫీజులు వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రవితేజ, శాంతినికేతన్ స్కూళ్లకు అనుమతులు, కనీస మౌలిక సదుపాయాలు లేనందున స్కూల్లో యాజమాన్యం పై తగు చర్యలు తీసుకోవాలని ఎంఇఒ నర్సింగరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అనుమతులు లేని కనీస మౌలిక సదుపాయాలు కల్పించని రవితేజ స్కూల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 1 నుండి 7వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఆ పాఠశాలలో సరైన తరగతి గదులు, ఆట స్థలం లేవని దీనివల్ల అక్కడున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అనుమతిలేని రవితేజ స్కూల్‌ను మూసివేయాలని డిమాండ్ చేశారు. సరైన ఆట స్థలాలు లేని శాంతినికేతన్ స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి.నాగచైతన్య, వి.చరణ్, అను, రత్న, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- డెంకాడ

మాన్సాస్ చైర్మన్ పి.అశోక్ గజపతిరాజు పుట్టినరోజును పురస్కరించుకొని ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కెవిఎల్ రాజు, డైరెక్టర్ పి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రమేష్, డీన్లు, హెచ్ఒడిలు అధ్యాపకులు క్యాంపస్‌ని సందర్శించిన అశోక్ గజపతి రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్, విజయనగరం మహారాజా ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని 81 యూనిట్ల రక్తదానం చేసి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.అనిల్ ప్రకాష్, అధ్యాప బృందం ఎన్.షణ్ముఖ రావు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో వాహనాన్ని ఢీ కొట్టిన యువకులు

మహిళకు తీవ్ర గాయాలు

పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

యువకులు వద్ద పట్టుబడిన గంజాయి పొట్లాలు

ప్రజాశక్తి- భోగాపురం

ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఒక ఫ్యామిలీని గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మహిళకు గాయాలు కాగా మూడేళ్ల చిన్నారి ప్రమాదం నుంచి తప్పించుకుంది. అక్కడే ఉన్న స్థానికులు ఆ యువకులను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా మరో ఇద్దరు యువకులు తప్పించుకున్నారు. పట్టుబడిన యువకుల వద్ద గంజాయి పొట్లాలు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ సంఘటన జాతీయ రహదారిపై అమనం జంక్షన్ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు అందించిన కథనం ప్రకారం .. ఏ రావివలస పంచాయతీ అమటాం గ్రామానికి చెందిన భార్య భర్తలైన వందరాని బంగారప్పుడు, రాధిక తమ మూడేళ్ల చిన్నారితో కలిసి తగరపువలస వైపు నుంచి ఏ. రావివలస వెళ్తున్నారు. ఇంతలో నలుగురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలపై వెనుక నుంచి వస్తున్నారు. అందులోని ఒక ద్విచక్ర వాహనం అమనాం జంక్షన్ వద్ద వెనుక నుంచి ఫ్యామిలీ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాధికకు గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడే ఉన్న స్థానికులు వాహనంతో పాటు ఆ యువకులను హైవే మొబైల్ వాహన సిబ్బందికి అప్పజెప్పారు. వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు. వెనుక ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకులు పారిపోయారు.

యువకుల వద్ద లభించిన గంజాయి పొట్లాలు

పట్టుబడిన యువకుల వద్ద నల్ల రంగుతో కూడిన గంజాయి పొట్లాలు వారిని పట్టుకున్న సమయంలో లభించినట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాక యువకులు కూడా గంజాయి మత్తులో ఉన్నారని చెబుతున్నారు. అయితే వీరు ఏ ప్రాంతానికి చెందినవారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. గంజాయి పొట్లాలు వీరు ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే దానిపై విచారణ చేస్తే అసలు విషయాలు బయట పడతాయని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరి యువకులు పోలీసుల అదుపులో ఉన్నారు.

బొబ్బిలిలో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో ఆన్లైన్ ట్రేడింగ్ మోసం జరిగింది. ఆన్లైన్ ట్రేడింగ్ లో ఇద్దరు మోసపోయారు. ఆన్లైన్ ట్రేడింగ్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు పొందవచ్చునని గుర్తు తెలియని వ్యక్తులు చెప్పడంతో పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పెట్టుబడులు పెట్టి మోసపోయారు. పట్టణంలోని వెలమ వారివీధిలో నివాసముంటున్న ఎల్ఐసి రిటైర్డ్ డవలప్మెంట్ అధికారి కృష్ణారావు ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు పొందవచ్చునని గుర్తు తెలియని వ్యక్తి చెప్పడంతో యాప్ ను డౌన్లోడ్ చేసుకుని జూన్ 5న పెట్టుబడులు పెట్టడం ప్రారంభించి మొదటిసారి రూ.లక్ష పెట్టుబడి పెట్టగా ఎక్కువ లాభం చూపించారు. జూన్ 5 నుంచి జూన్ 15 వరకు రూ.51 లక్షల వరకు పెట్టుబడి పెట్టించి తిరిగి చెల్లించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరో వ్యక్తి గరుగబిల్లి భార్గవి యుఎస్ బ్యాంక్ విఐపి యాప్‌లో ఏప్రిల్, మే నెలలో రూ.1.60లక్షలు పెట్టుబడి పెట్టి ఎప్పటికి చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆన్లైన్ ట్రేడింగ్ మాయలో పడొద్దని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దన్నారు. ఆన్లైన్ ట్రేడింగ్ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగేశ్వరరావు చెప్పారు.

గ్రామ పంచాయతీ కొండపాలెం

వేలం కం టెండరు నోటీసు

రేఖా నెం.23/2024 తే.27-06-2024

విజయనగరం జిల్లా, గరివిడి మండలం, కొండపాలెం (గరివిడి) గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ వ్రాయబడిన 2024-2025 సంవత్సరమునకు వేలం మరియు టెండర్లు ద్వారా గుత్తకిచ్చుటకు తే.03-07-2024ది. వరకు టెండర్లు స్వీకరించబడును, మరియు ఉదయం 11:00 గంటల నుండి ఈ దిగువ సంతకందారునిచే వారి అనుమతి పొందిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ మార్కెట్ వేలం పాట వేయబడును. వేలం పాట మరియు టెండర్లులలో పాల్గొనదలచినవారు ఆయా గంటలకు ఈ క్రింది విధంగా చూపబడిన ధరావతులు ముందుగా చెల్లించి వేలం మరియు టెండర్లులలో పాల్గొనవలెను మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్లు ముందుగా దాఖలు చేయవలెను. వేలం నిబంధనలను పాటించి వేలంపాట మరియు టెండర్లలో పాల్గొన వలెను.

వ.సం	వేలం వివరములు	లీజు కాలం	ధరావత్తు	సాల్వెన్సీ విలువ
1	రోజు వారి మార్కెట్లు	2024-2025	10,000/-	50,000/-
2	కంపోస్టు	2024-2025	100/-	5,000/-
3	పాత దినపత్రికలు	2024-2025	100/-	5,000/-

టెండర్లు:
1) 28 మంది కాంట్రాక్ట్ స్వీపర్లును సప్లైయి చేయుటకు 2024-2025 రూ. 5000/-
2) 10 మంది మంచినీటి పని వారును సప్లైయి చేయుటకు 2024-2025 రూ.1000/-
3) వీధిలైట్లు బాగు చేయుటకు, స్తంభం ఎక్కి కట్టుటకు (01) ఒక్కరిని సప్లైయి చేయుటకు గాను 2024-2025 రూ. 500/-
4) పారిశుద్ధ్యపు ట్రాక్టరు నడుపుటకు (03) ముగ్గురు సప్లయి చేయుటకు 2024-2025 రూ. 500/-
5) పారిశుధ్యపు పవర్ ఆటో (వాన్స్) నడుపుటకు (02) ఇద్దరు సప్లైయి చేయుటకు 2024-2025 రూ. 500/-
6) ప్రజారోగ్య సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె సప్లైయి చేయుటకు 2024-2025 రూ. 200/-
7) ప్రజారోగ్య సామానులు మరియు మందులు సప్లైయి చేయుటకు 2024-2025 రూ. 1000/-

పై వాటిని సప్లైయి చేయుటకు తే-03-07-2024 దిన మధ్యాహ్నం 1-00 (ఒంటి గంట) నుండి సాయంత్రం 4-00 గంటల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తీసుకోగలరు. అదే రోజు సాయంత్రం 4-00 గంటల వరకు రాని టెండరు ధారావత్తు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. ఇతర వివరముల కొరకు కార్యాలయంలో సంప్రదించగలరు.

షరతులు: 1) టెండర్లులలో ఒకటవ ఐటమ్ 28 మంది కాంట్రాక్టు స్వీపర్లకు కొబ్బరి నూనె, సబ్బులు - సదరు తక్కువ రేటు గల టెండరు దారుడు సప్లైయి చేయవలెను.

గమనిక : 1) వేలములు, టెండర్లు ఏ విధమైన కారణం చేత రద్దు పరచే అధికారం ఈ గ్రామ పంచాయతీ వారికి కలదు
2) ఏ విధమైన విషయమైనా గ్రామపంచాయతీ పని వేళల్లో మాత్రమే తెలుసుకోగలరు.
3) శ్రీ కలెక్టర్ సం॥ విభాగం వారి ఉత్తర్వులు లోబడి

పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ కొండపాలెం